క్లుప్తంగా

'భవదీయం' ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



భవదీయం సేవా సంస్థను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: భవదీయం సేవా సంస్థ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు కట్టమూరి శ్రీనివాస రావు తెలిపారు. మురళీనగర్‌లో భవదీయం స్వచ్ఛంద సేవా సంస్థను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ దేవాలయాలకు స్వచ్ఛంద సేవకులను పంపిస్తామన్నారు. ఆయా దేవాలయాల ఉత్సవాలు, దేవతా పారాయణం, ఇతర ఆధ్యాత్మిక ఉత్సవాలకు తమ సంస్థ ద్వారా కోలాటం, సాంస్కృతిక కళాకారుల బృందాలు పంపిస్తామని చెప్పారు. కేవలం ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడం కోసమే భవదీయం ఆధ్యాత్మిక సేవా సంస్థను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సుగుణకుమారి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్



నందగిరినగర్‌లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో బుధవారం సాయంత్రం దోమల నిర్మూలనకు మినీ ఫాగింగ్ చేపట్టారు. మలేరియా విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, శ్మశానవాటిక ఏరియా, గౌరీ కల్యాణ మండపం వెనుక రోడ్డు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

షోకాజ్ నోటీసులపై అంగన్‌వాడీల వివరణ



ఐసీడీఎస్ అధికారులకు వివరణ ఇస్తున్న అంగన్‌వాడీలు

తాటిచెట్లపాలెం: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విధులను విడిచిపెట్టి 37 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు సంబంధించి బుధవారం అంగన్‌వాడీలు ఆర్ అండ్ బీ దరి కార్యాలయంలో సీడీపీవో, సెక్టర్ సూపర్‌వైజర్లకు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. పండగ వేళల్లో సైతం తాము నిరసన కార్యక్రమం చేపట్టామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అంగన్‌వాడీలు కోరారు.

తగ్గిన కాలీఫ్లవర్ ధర



రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్స్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న కాలీఫ్లవర్ ధర తగ్గింది. కొద్ది రోజులుగా కిలో రూ.34కు విక్రయిస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా రూ.22కు ధర తగ్గడంతో వినియోగదారులు, హోటల్, తోపుడుబళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కాలీఫ్లవర్ రాజమహేంద్రవరం నుంచి వచ్చేది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలోని ఆర్లీ, సంతపాలెం రైతులు పండించి బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మరి కొదిరోజుల్లో కిలో ధర రూ.10కు దిగివచ్చే అవకాశం ఉంది.

ఆహ్లాదం.. ఆనందం

- మురళీనగర్ పార్కుల్లో ఆకర్షణీయ ప్రతిమలు
- చిన్నారులు, సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు



బృందావన్ పార్కులో ముచ్చటగొలిపే గోపాలకృష్ణుడి విగ్రహం



హరిత పార్కులో బంగారు వర్ణంతో మెరిసిపోతున్న బుద్ధుడు

మురళీనగర్: మురళీనగర్ అంటేనే అందమైన ఉద్యానవనాలకు నిలయం. ఈ ప్రాంతంలో 11 పార్కులు ఉన్నాయి. ప్రతి సెక్టార్‌లోనూ ఒక పార్కు ఏర్పాటు చేశారు. దేనికదే ప్రత్యేకమని చెప్పవచ్చు. సందర్శకులను ఆకర్షించాలంటే ఉద్యానవనంలో పచ్చదనంతోపాటు చిత్రాలు, ప్రతిమలు ఉండాలి. అందుకే ముందు చూపు గల మురళీనగర్ పార్కుల నిర్వాహకులు ప్రత్యేకంగా అందమైన ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏ పార్కును సందర్శించినా పెద్దలు, పిల్లలను ఆకర్షించే విధంగా వివిధ రకాల ప్రతిమలు దర్శనమిస్తాయి.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

మురళీనగర్‌లోని వాకర్స్ పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు, బృందావన్ పార్కు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు, హరిత పార్కుల్లో ఆధ్మాత్మికత ఉట్టిపడేలా, భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రతిమలు ఏర్పాటు చేశారు. వాకర్స్ పార్కులో బోధి చెట్టు కింద మౌన ముద్రలో ఉన్న బుద్ధుడు దర్శనమివ్వగా.. బృందావన్ పార్కులో యోగాసనంలో బుద్ధుడు, హరిత పార్కులో బంగారు మేను ఛాయతో మెరిపోతూ బుద్ధ భగవానుడు దర్శనమిస్తారు. బృందావన్ పార్కులో శ్రీకృష్ణుడి అందమైన విగ్రహం, దాని చుట్టూ కొలను, వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మురళీగానలోలుడైన చిన్నికృష్ణుడి నల్లరాతి విగ్రహం చూపరుల్లో ఆధ్మాత్మిక ఆనందాన్ని కల్పిస్తాయి. ప్రశాంతి ఆధ్మాత్మిక పార్కులో దేవుళ్ల విగ్రహాలతోపాటు రామకృష్ణ పరమహంస, శారతామాత, శంకరాచార్యులు పాలరాతి విగ్రహాలు ఆనంద పరవశులను చేస్తాయి. ఇవన్నీ నిర్వాహకుల విరాళాలతో ఏర్పాటు చేశారు.

చిన్నారుల కోసం..


పార్కుల్లో చిన్నారులను ఆకట్టుకునే ప్రతిమలతో పాటు వారిలో దేశభక్తిని పెంపొందించే విధంగా విగ్రహాలు, కుడ్య చిత్రాలను ఏర్పాటు చేశారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఉత్తరాంధ్ర ప్రముఖులు అల్లూరి సీతారామరాజు, శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ), గురజాడ అప్పారావు, తెన్నేటి విశ్వనాథం, వ్యవహార భాషా ఉద్యమ నేత గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిలువెత్తు మహాత్మా గాంధీ విగ్రహం పార్కులోకి ప్రవేశించగానే మన దేశ స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను గుర్తు చేస్తుంది. బృందావన్ పార్కులో భరతమాత నిలువెత్తు విగ్రహం మనలో జాతీయ భావాలను కల్పిస్తుంది. చిన్నారులు ఎక్కువగా ఇష్టపడే జంతువుల ప్రతిమలు మనకు కనిపిస్తాయి. బృందావన్ పార్కులో జిరాఫీ, చిరుత పులి, హరిత పార్కులో జిరాఫీ వంటి ప్రతిమలు ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని కల్పించడమే ధ్యేయంగా పార్కు నిర్వహణ కమిటీలు పనిచేస్తూ అందిరి మన్ననలు పొందుతున్నాయి.



వాకర్స్ పార్కులో బోధి వృక్షం వద్ద మౌన ముద్రలో ఉన్న బుద్ధభగవానుడు



వాకర్స్ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహం





బృందావన్ పార్కులో చిరుతపులి, జిరాఫీల ప్రతిమలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు



సీతంపేట: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. ఈ నెల 19న జరగనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సామాజిక వర్గ నాయకులు, అంబేడ్కరీయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. 20 ఎకరాల స్థలంలో, రూ.400 కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, రాజ్యాంగ నిర్మాతకు సువర్ణ అక్షరాలతో లిఖింపదగిన విధంగా సీఎం వైఎస్ జగన్ చేపట్టిన భారీ విగ్రహావిష్కరణకు తరలివెళ్లి ఐక్యతను చాటి, రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరు కాదలచిన వారు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల కల్లా తమ వివరాలు తెలియజేయాలన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా జగనన్న పాలన



మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె నివాసంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్య ఫలాలు బడుగు బలహీన వర్గాలకు అందాలన్నదే జగనన్న ఆశయమన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వమూ పాటించని సామాజిక న్యాయాన్ని వైఎస్సార్‌సీపీ సర్కారు చేతల్లో చూపిస్తోందని పేర్కొన్నారు. సీఎం జగన్ ఆలోచనా విధానం, విజన్ వల్ల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత దిశగా పేద వర్గాల వారు నేడు తృప్తి పొందుతున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గౌరవార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం, ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించడం గొప్ప విషయంగా అభివర్ణించారు. రాబోయే తరాలు సైతం గుర్తుచేసుకునేలా స్మృతివనాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

సామాజిక సాధికారతకు కృషి

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆయా కులస్తుల సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారని పిల్లి సుజాత అన్నారు. దేశంలోనే ఈ తరహా పాలన మరెక్కడా ఇంతవరకు తాను చూడలేదని ప్రశంసించారు. యాత కులస్తులంతా ముఖ్యమంత్రి వెంటే ఉంటారని ఆమె తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, ప్రధాన కార్యదర్శి బసరమాని లక్ష్మణరావు, ప్రతినిధులు బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, సిమ్మా గోవింద్, సిమ్మా శ్రీనివాస్, పిల్లి సంతోష్, పిల్లి రాజరాఘవేంద్ర, ఎల్.తవిటయ్య, పిల్లి కన్నారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కట్టడికి ప్రత్యేక 'నిఘా'



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సీసీ కెమెరాలు



పోర్టు తూర్పు గేటు వద్ద సీసీ కెమెరా

సీతమ్మధార: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా సీతమ్మధారతో పాటు పలు ప్రాంతాల్లో నిఘా నేత్రాలు పర్యవేక్షిస్తున్నాయి. జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్ల ఆధ్వర్యంలో పర్యవేక్షించేలా ఎటువంటి భద్రతా లోపం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనరేట్‌లోని సీపీ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ ఫుటేజీలను వీక్షించేలా చర్యలు చేపట్టారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు తూర్పు గేటుతోపాటు ఇతర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా పోలీస్ శాఖ, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులు నిరంతరం గమనిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి గ్రీన్ గార్డెన్స్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, పంజాబ్ హోటల్ కూడలి, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

తాటిచెట్లపాలెం: ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్, సబ్ స్టేషన్ పరిధిలోని పలు 11 కేవీ ఫీడర్స్‌లో జరుగుతున్న నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 19న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాధవధార వుడా కాలనీ, గంగా గోదావరి అపార్ట్‌మెంట్, శ్రీ శాంతి ల్యాండ్‌మార్క్, విజేత మార్ట్, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, గ్యాస్ గొడౌన్ జంక్షన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతం, సాకేతపురం, విమాన్‌నగర్, వినోద్‌నగర్, ఎన్ఏడీ, జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీనగర్, గాంధీనగర్, రైతుబజార్ ఏరియా, రాజీవ్‌నగర్, అప్పయ్యనగర్, గాంధీనగర్, వంశీనగర్, నరసింహనగర్, కాకానినగర్, దుర్గాపురం, సాయినగర్, ఆర్ అండ్ బీ జంక్షన్, మద్రిపాలెం వుడా లేఅవుట్, మహత్ కాలనీ, రామన్న కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

'కళా ఉత్సవ్' విజేత రిషికకు సత్కారం



విద్యార్థిని రిషికను సత్కరిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: జాతీయ స్థాయిలో ప్రతి ఏడాది ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే విభిన్న కళారంగాల పోటీల్లో తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని జి.రిషిక అద్భుతమైన కళా నైపుణ్యంతో మొదటి స్థానం సాధించింది. కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్, రీజనల్ డిప్యూటీ కమిషనర్, సహాయక కమిషనర్లు రిషికను, వాల్తేర్ కేవీ సంగీతాచార్యులు డాక్టర్ ద్వారం త్యాగరాజు, నాట్యాచారిణి సుంకర కృష్ణవేణిలను అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం కేంద్రీయ విద్యాలయంలో రిషికను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ పోటీల్లో రిషిక కూచిపూడి నృత్యంతో అందరినీ మెప్పించి ప్రథమ బహుమతి, బంగారు పతకాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ విజయం ద్వారా కేంద్రీయ విద్యాలయ సంఘటన్, వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ పేరుప్రతిష్ఠలు మరింత పెరిగాయన్నారు. రిషికను ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు, ప్రధానితో జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. సత్కార కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శైలజ, కేవీ సిబ్బంది ఎం.రేఖ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమీనా, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామగోత్రాలతో అమ్మవారిని పూజించారు. సాయంత్రం కూడా ఎరుకుమాంబ అమ్మవారిని పసుపు, కుంకమలతో అభిషేకించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర రహిత భారతం 'ఇట్లసుత' కావ్యం



ప్రసంగిస్తున్న రచయిత వరికొండ కాంతారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహితీ సమావేశంలో రచయిత వరికొండ కాంతారావు(వరంగల్) స్వీయ రచనా కావ్యం ×ఇట్లసుత×పై ప్రసంగించారు. భారతంలో యుద్ధం వల్ల కలిగే ప్రాణ నష్టం శ్రీకృష్ణుడికి ఇష్టం లేదని, అందువల్ల కర్ణుడు కౌరవ పక్షం నుంచి పాండవ పక్షంలోకి వస్తే యుద్ధాన్ని నివారించే వీలుంటుందన్న ఆలోచనతో ఇట్లసుత కావ్యాన్ని రచించినట్లు తెలిపారు. ఇట్లసుత తెలంగాణ మాండలికంలో వెలసిన సంపూర్ణ ఇతిహాసమని, భారతంలో ప్రతి పాత్ర అంతర్మథనాన్ని, ఆలోచనలను చక్కగా చిత్రించినట్లు చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఇట్లసుత కావ్యం కురుక్షేత్ర రహిత భారతం రచనని, జన నష్టం జరగకుండా రచయిత నైపుణ్యంతో వైవిధ్య రచన చేశారన్నారు. అనంతరం రచయిత కాంతారావును ఘనంగా సత్కరించారు. సమావేశంలో రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రాధారాణి, నూకరాజు, వేదుల కామేశ్వరశర్మ, రామతాత పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు సేవలు చిరస్మరణీయం

డిప్యూటీ మేయర్ శ్రీధర్



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: శ్రీ కృష్ణదేవరాయలు సేవలు చిరస్మరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. ఎన్ఏడీ కాకాని నగర్‌లో ఉన్న కాపు, తెలగ, బలిజ సామాజిక భవనంలో బుధవారం కృష్ణదేవరాయల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జియ్యాని మాట్లాడుతూ కృష్ణదేవరాయల పరిపాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా పాలన అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, వి. భాస్కరరావు, బీఎస్ నాయుడు, దాసరి తేజ, కంపర సత్తిబాబు, సమ్మెట్ల రామకృష్ణ, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ తీర్థ'



ఆస్థాన మండపాన్ని శుభ్రం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపం, భోగ మండపం, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే స్వామివారి పూజా సామగ్రిని శుభ్రం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక గురువు భారత్



ఎంపీ జీవీఎల్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

అల్లిపురం: ప్రపంచ దేశాలకు భారత్ ఆధ్యాత్మిక నాయకత్వం వహిస్తోందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్థాపించిన బ్రహ్మ బాబా 55వ అవ్యక్త స్మృతి దినోత్సవం సందర్భంగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. మానసిక ఒత్తిడి నుంచి బ్రహ్మకుమారీ బోధనల ద్వారా విముక్తి కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశంలో యోగాకు విస్తృత ప్రాచుర్యం కల్పించారన్నారు. సంస్థ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద అమరజ్యోతి బుర్ర కథా బృందం వారిచే పితాశ్రీ బ్రహ్మబాబా అద్భుత పావన జీవిత చరిత్ర విని, చూసి తరించాలని కోరారు. బ్రహ్మ పోస్టర్‌ను ముఖ్య అతిథి ఆవిష్కరించారు. ఎంపీ జీవీఎల్‌కు చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో విశాఖ సమాచారం ఎడిటర్ వీరభద్రరావు, సంస్థ ప్రతినిధులు రమా, బీకే శివలీల, శశికళ, సత్యవతి, బీకే వేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి ఈ ప్రత్యేక పూజలో పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



ఉరివేసుకుని మృతిచెందిన పోదులాపు రాజు

సీతమ్మధార: మనస్తాపానికి గురైై ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో నివసిస్తున్న పోదులాపు రాజు(40) స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పక్కనే ఉన్న ఇంటికి వెళ్లి మహిళతో మాట్లాడాడు. చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి ఆమెతో ఎందుకు మాట్లాడుతున్నావంటూ రాజును మందలించారు. దీంతో అతడు మనస్తాపం చెంది ఇంట్లోనే ఉండిపోయాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఉన్న కుమారుడిని పనిమీద బయటకు పంపించాడు. ఎవరూ లేని ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి ఇంటికి వచ్చి తలుపు కొట్టినప్పటికీ తెరవకపోవడంతో చుట్టుపక్కల ఉన్న వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోర్త్‌టౌన్ కానిస్టేబుల్ వచ్చి తలుపులు పగలగొట్టారు. రాజు విగతజీవిగా కనిపించడంతో భార్య కృష్ణవేణి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్న నలుగురిని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాటిచెట్లపాలెం మసీద్ దరి బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఫోర్త్‌టౌన్ ఎస్ఐ సూర్యనారాయణ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. విజయనగరం జిల్లా వంగర మండలం బీసీ వీధికి చెందిన కె.రాము, అక్కయ్యపాలెం ఎంటీసీ పాలేనికి చెందిన శీరపు కృష్ణమూర్తి, అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌కు చెందిన శీరపు శంకరరావు, అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కు చెందిన ఎన్.సింహచలం అనే నలుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.27,650 నగదు స్వాధీనం చేసుకున్నారు.